జగనన్న కాలనీలో సమస్యల తిష్ట

- కనీస మౌలిక సదుపాయాలు కల్పించని ప్రభుత్వం
- ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు




మంగళగుంటపాలెంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను నిలిపేసిన దృశ్యం

నరసాపురం రూరల్: పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత ప్రజలకు సెంటు, రూరల్ ప్రాంత ప్రజలకు సెంటున్నర చొప్పున ఇంటిస్థలాలను ఇచ్చింది. అలాగే ఇంటి నిర్మాణానికి కూడా సాయం అందించింది. ఆ సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీలు పేరుతో ఉండే కాలనీ ఊళ్లను తలపిస్తున్నాయంటూ పేర్కొన్నారు. క్రమంగా ఇంటి నిర్మాణాలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను గతప్రభుత్వ కల్పించింది. అయితే 2024 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలపై శీతకన్ను వేసింది. ఇళ్ల నిర్మాణాలపై శ్రద్ధ చూపించకపోవడం, నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాలనీలో వందలాది నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయి. మంగళగుంటపాలెం గ్రామంలో అర్బన్ లే అవుట్ పేరుతో పట్టణానికి చెందిన వారికి ఇచ్చిన జగనన్న కాలనీలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలతో ప్రస్తుతం అక్కడ ఉంటున్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు పావుగంట మాత్రమే వచ్చే నీరు సరిపడక పోవడంతో వారానికి ఒకసారి ట్యాంకు ద్వారా సరఫరా చేస్తున్నారు. అవికూడా అంతంత మాత్రంగానే సరఫరా చేస్తుండటంతో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎండలు తీవ్రమైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ఆందోళన చేసినా స్పందించని అధికారులు

ఇటీవలే సీపీఎం నాయకుల సహకారంతో జగనన్న కాలనీలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేశారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మంగళగుంటపాలెంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలంలో పది ఎకరాలను పూడిక చేసి 630 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలాలలో సుమారు 50 కుటుంబాలు గృహాలను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారు. అయితే వారికి తాగడానికి మంచినీటి సదుపాయం కూడా లేదు. వారంతా పేదలే కావడతో తాగునీటికి కొనుక్కుని తెచ్చుకునే స్థోమత లేక పట్టణం నుంచి టిన్నులతో నీరు తెచ్చుకునే దుస్థితి నెలకొందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. కూటమి సర్కారు వచ్చిన తరువాత ఈ కాలనీలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. విద్యుత్ వైర్లు తెగి పడడం, ట్రాన్స్‌పార్మర్లు పాడై వీధిలైట్లు లేక కాలనీ చీకటిమయంగా మారిందని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారంతా కోరుతున్నారు.

పిల్లలతో బిక్కుబిక్కుమంటూ జీవనం



కాలనీలో సౌకర్యాల లేమితో అనేక ఇబ్బందులు పడుతున్నాం. సరైన రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేదు. ఇక్కడ మేము పడుతున్న ఇబ్బందులను ఆర్డీఓ, కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వీధి లైట్ల నిర్వహణ కూడా సరిగా లేదు. కాలనీలో దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

– చెరుకువాడ రాజేశ్వరి, జగనన్న కాలనీవాసి

నీటి సమస్య ఎక్కువగా ఉంది



మా కాలనీకి కొద్దిపాటి దూరంలోనే రుస్తుంబాద తాగునీటి ప్రాజెక్టు చెరువు ఉంది. అయినప్పటికీ మాకు తాగునీరు, ఇతర అవసరాలకు నీటికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కుళాయిల ద్వారా నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో వారంలో ఒకరోజు ట్యాంకరుతో నీటిని ఇస్తున్నారు. రానున్న వేసవి రోజుల్లో మా పరిస్థితి ఏంటో? మాకే అర్థం కావడం లేదు.

– తవిటిక సత్యం, జగనన్న కాలనీ వాసి

కూటమి ప్రభుత్వం విశ్వాసం కోల్పోయింది



తిర్రే బాబూరావు

నరసాపురం: కూటమి సర్కారు తక్కువ సమయంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు తిర్రే బాబూరావు పేర్కొన్నారు. పార్టీ పెన్షనర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని అన్నారు. వైఎస్సార్ సీపీ అహర్నిశలు చేసిన అనేక సంక్షేమ పథకాలు అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి కూడా అమ్మ ఒడి ఇస్తానని చెప్పి చివరకు ఆ పథకమే లేకుండా చేశారని అన్నారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. కూటమి పాలన మోసాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని చెప్పారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని చెప్పారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కొవ్వొత్తుల ర్యాలీ

పెనుగొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్టేరులో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆచంట నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్ అసోషి యేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డేవిడ్ రాజు, తిమోతిరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాలు, మహిళా సమైక్య ప్రజా సంఘాలు, దళిత సంఘాలు ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందని, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బుద్ధరాజును సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

పాలకొల్లు సెంట్రల్: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు బుద్ధరాజు తెలిపారు. శనివారం రాత్రి 50 మంది పేద ముస్లింలకు నిత్యావసరల కిట్స్, దుప్పట్లు అందజేశారు. బుద్ధరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ అధినేత మంతెన వెంకట రామరాజు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. రంజాన్ పురస్కరించుకుని కిట్స్ అందుకున్న ముస్లింలు ఎంవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు రాజు, పి.సూర్యనారాయణ రాజు, పెన్మెత్స రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్టేరులో చలివేంద్రం ప్రారంభం



మార్టేరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై కె స్వామి

పెనుమంట్ర: మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బస్‌స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం పెనుమంట్ర ఎస్సై కె.స్వామి ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై అన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు కేకేఆర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రోజుకు ఒక దాత చొప్పున 75 రోజుల పాటు ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గుడిమెట్ల లక్ష్మారెడ్డి, నెగ్గిపూడి మాజీ సర్పంచ్‌లు అల్లం భాస్కరరెడ్డి, కర్రి అచ్యుత రామారెడ్డి, జిల్లా కార్యదర్శి తాడి భీమారెడ్డి, అజయ్‌రెడ్డి, చింతా ధర్మవేరా, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మోషేన్‌రాజుకు నేతల ఉగాది శుభాకాంక్షలు



మోషేన్‌రాజుకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భీమవరం: శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆకాంక్షించారు. ఉగాది పండుగ సందర్భంగా పలువురు నాయకులు మోషేన్‌రాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోడే యుగంధర్, గాదిరాజు రామరాజు, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, పేరిచర్ల నర్సింహరాజు పాల్గొన్నారు.

ఆకివీడులో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న దంపతులు

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద మహాచండీ, దుర్గా సహిత రుద్ర హోమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. 22 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ 6వ వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. దేశం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని హోమం నిర్వహించినట్లు అర్చకులు గూడూరు నాని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. 31వ తేదీన అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారని తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కంటైనర్



కంటైనర్‌ను లాగుతున్న దృశ్యం

భీమవరం: స్థానిక విస్సాకోడేరు వంతెన సమీపంలో కంటైనర్ అదుపు తప్పి పక్కనున్న డ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. పౌర సరఫరాల శాఖ గోదాముల వద్ద జరిగిన ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. నిత్యం వాహన రద్దీతో ఉండే జాతీయ రహదారిపై ఆదివారం కావడం, ఉగాది సందర్భంగా అంతగా రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. క్రేన్ సహాయంతో కంటైనర్‌ను బయటకు తీశారు.

ఘాట్‌లు ఇలా.. స్నానాలు ఎలా..?



అధ్వానంగా వలంధర్‌రేవు



మట్టి పేరుకుపోయి ఉన్న కొండాలమ్మ ఘాట్



నిరుపయోగంగా మారిన అమరేశ్వర ఘాట్



బుడ్డిగరేవు దుస్థితి

నరసాపురం మీదుగా వశిష్ట గోదావరి ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో గోదావరిలో భక్తులు స్నానం చేసేందుకు వివిధ ఘాట్‌లను నిర్మించారు. అయితే ఆ ఘాట్‌లన్నీ ప్రస్తుతం అధ్వానంగా మారాయి. ముఖ్యంగా వరదల సమయంలో సాధారణంగా ఘాట్‌ల మెట్లపై బురద పేరుకుపోతూ ఉంటుంది. వరదల అనంతరం వాటిని శుభ్రం చేయించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో బురద పేరుకుపోయి అధ్వానంగా మారాయి. లాకుల నుంచి కొండాలమ్మ గుడివరకూ బుడ్డిగరేవు, అమరేశ్వరఘాట్, లలితాంబ ఘాట్, వలంధరర్‌రేవు, కొండాలమ్మ ఘాట్‌ల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. విశిష్ట రోజుల్లో గోదావరిలో స్నానం ఆచరించేందుకు వచ్చే భక్తులు అపరిశుభ్రంగా ఉన్న ఘాట్‌ల వద్దే పుణ్యస్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. 2015లో పుష్కరాల నేపథ్యంలో రూ.10 కోట్లతో ఘాట్‌లను అభివృద్ధి చేశారు. అయితే పనులు నాసిరకంగా చేయడంతో పాటు అధికారుల నిర్వహణ లోపంతో ఘాట్‌లు ప్రస్తుతం శిథిలస్థితికి చేరాయి. ఇప్పటికైనా నాయకులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఘాట్‌ల వద్ద పరిస్థితిని మెరుగుపర్చాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. - నరసాపురం

ముఖదారమ్మ జాతర ప్రారంభం



23 కాసుల బంగారు మంగళసూత్రం అలంకరణతో ముఖదారమ్మ

పాలకొల్లు సెంట్రల్: ఉగాది పర్వదినం పురస్కరించుకుని స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారికి భక్తుల సహకారంతో 23 కాసులతో తయారు చేయించిన బంగారు మంగళసూత్రం అలంకరించామని ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా తెలిపారు. అలాగే భక్తులు చెక్కా కృష్ణ, రోజా దంపతులు 500 గ్రాములతో అమ్మవారికి వెండి గరగ, చిల్లిముంతల జీవన్ సుబ్రహ్మణ్యం, మాధురి దంపతులు 400 గ్రాములతో ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడికి వెండి కిరీటం అందించారు. వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు పిన్ని ఉప్పరి కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంభం వేసి అనంతరం జాతర ఊరేగింపు ప్రారంభించారు. వెలిగట్ల రమేష్ మిత్రబృందం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మండెల జిజి, కొల్లంశెట్టి చిన్ని, చిల్లిముంతల బాబి, వెలిగట్ల గణేష్, బెజవాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రసధుని ఆధ్వర్యంలో కవి సమ్మేళనం



పాలకొల్లు సెంట్రల్:కవితల పోటీల్లో విజేతలతో రసధుని సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉగాది పర్వదినం సందర్భంగా రసధుని ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రస్థాయి కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కవితల పోటీల్లో ఉన్న మట్ల ప్రేమ్ కుమార్, జవ్వాది దాశరధి శ్రీనివాస్, చిలుకూరి సూర్యప్రసాద్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. అలాగే ఉప్పల వెంకటాచార్యులు, ఎస్‌కేనాగేశ్వరరావు, పాపాప్పు విజయలక్ష్మిలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మామిడి వెంకటేశ్వరరావు, రసధుని సభ్యులు కొట్టి భాస్కరరావు, యర్రంశెట్టి వెంకటరత్నం, మామిడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు ఉగాది పురస్కారం



నరసాపురం: ఉగాది పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం జేఏసీ, రిపబ్లిక్ అండ్ ఇండియా పార్టీల ఆధ్వర్యంలో ఒంగోలు జిల్లా టంగుటూరులో బీఆర్ అంబేడ్కర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ తెలిపారు. మాలల అభివృద్ధి కొరకు పోరాటం చేసిన నాయకులకు ఈ ఉగాది పురస్కారాలను అందించారన్నారు. దానిలో భాగంగా తనకు అంబేడ్కర్ ఉగాది పురస్కారం దక్కిందన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: స్థానిక రాయల్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక తెలగ కళ్యాణమండపంలో ఉగాది వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చిన్నారుల భరతనాట్యం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వివిధరంగాల్లో నిష్ణాతులైన కాపు ప్రతినిధులకు ఉగాది పురస్కారాలు అందించారు. న్యాయవాదులు, వైద్యులు, జర్నలిస్టులు, సామాజికవేత్తలు, రాజకీయ ప్రముఖులకు ఇలా 400 మందికి పుస్కారాలు అందించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకిరామ్, కలిగినీడి చిదంబరం, జక్కం బాబ్జి, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): ఉగాది పండుగను పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ముచ్చర్ల భవాని శంకర్ దంపతులు, ఏలూరి శ్రీనివాస్ దంపతులు, వీరమల్లు శ్రీనివాసరావు దంపతులు, నైనాలశెట్టి సుబ్బారావు దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అమ్మవారికి 300 మామిడి కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మెంటేవారి తోట వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కాళ్ల: గ్రామంలోని కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ళ ఎస్సై తెలిపారు. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నిందితుల నుంచి రూ.6,100 నగదు, కోడి పుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

గ్రామాల్లో ఉగాది సందడి



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగొండ: విశ్వావసు నామ ఉగాది సంబరాలు పెనుగొండ మండలంలో వేడుకగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామదేవతల ఆలయాల వద్ద మొక్కుబడులు, జాతరలు జోరందుకున్నాయి. పెనుగొండ శాంతి నగర్‌లోని పద్దాల వెంకమ్మ ఆలయం వద్ద దొంగగూడెం వాసులు మొక్కులు తీర్చుకున్నారు. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వేద పండితులు నరసింహమూర్తి, వడలి అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఆంజనేయ శర్మలు పంచాంగ శ్రవణం చేశారు.

క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలంయలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్షీరారామలింగేశ్వరస్వామిని, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. పట్టణంలో కోడిగట్టున ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు కిష్టప్ప, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేడపాడులో..

యలమంచిలి: తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకున్నారు. మేడపాడు గ్రామంలోని శ్రీఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. యలమంచిలి శ్రీఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితుడు గుత్తిన నరసింహమూర్తి (బాబ్జి)తో పంచాంగ శ్రవణం చేయించారు. ఆలయ అర్చకుడు యలమంచిలి నరేంద్ర శర్మ, ఈఓ ఎస్.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని వెలగలేరు గ్రామంలో స్టేట్‌హైవే రోడ్డుపక్కన ఉన్న శ్రీ తలుపులమ్మ వారికి ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ నిర్వాహకుడు ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే జుత్తిగ శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి వారి ఆలయ అర్చకులు ర్యాలి వాసుశర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే సోమరాజు ఇల్లిందలపర్రులో ఉన్న శ్రీ దానమ్మ వారి ఆలయాన్ని ఆలయ పునర్నిర్మాణ ప్రధానదాత, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విమానాయన శాఖ డైరెక్టర్ వీఎన్ భరత్ రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకట్ నారాయణ రెడ్డి, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి పాల్గొన్నారు.



యలమంచిలి: మేడపాడు శివాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలుచేస్తున్న భక్తులు



పెనుమంట్ర: జుత్తిగలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



పెనుగొండ: దొంగగూడెంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్

90102 23729 (పాలకొల్లు)

95055 07552 (పాలకొల్లు)

90102 23729 (ఆచంట)

95055 07552 (నరసాపురం)

Office mail : tpgadvt@gmail.com